క్లుప్తంగా

సర్వేను వేగవంతం చేయాలి



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ దామోదర్

చిన్నశంకరంపేట(మెదక్): సమగ్ర కుల గణన సర్వేను వేగవంతం చేయాలని ఎంపీడీఓ దామోదర్ కోరారు. సోమవారం చిన్నశంకరం పేట, కామారం తదితర గ్రామాల్లో సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఎన్యుమెరేటర్లకు పలు సూచనలు చేశారు. గ్రామాల్లో వరుస క్రమంలో సర్వేను చేస్తే వేగంగా జరిగేందుకు అవకాశం ఉందన్నారు. సకాలంలో సర్వేను పూర్తిచేయాలని కోరారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు



ట్యాంకులోకి చేరుతున్న భగీరథ నీరు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటకు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టినట్లు మిషన్ భగీరథ డీఈ ప్రవీణ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతుతూ.. కొన్నిరోజుల నుంచి శివ్వంపేటలోని రక్షిత నీటి ట్యాంకుల్లోకి భగీరథ నీరు రాకపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని సమస్యను సరిచేసినట్లు చెప్పారు. 15 రోజులకోసారి ప్రధాన నీటి ప్లాంట్ వద్ద క్లినింగ్ చేస్తుండడం వల్ల పంపింగ్ నిలిచిపోవడంతో కొంతమేర అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు. సోమవారం గ్రామంలో ఉన్న 6 రక్షిత వాటర్ ట్యాంకుల్లోని మిషన్ భగీరథ నీరు చేరిందని సరఫరాలో ఎలాంటి ఆటంకాలు ఉండవని చెప్పారు.

ఘనంగా సంజీవాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ



మాట్లాడుతున్న సరస్వతీస్వామి

కొడిపల్లి(నర్సాపూర్): సంజీవాంజనేయ స్వామి ఆలయంలో శివపంచాయతన సహిత ఆంజనేయస్వామి, నవగ్రహ దేవతాల యంత్ర, విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. మండలంలోని ధర్మాసాగర్‌గేట్ వద్ద సోమవారం రంగంపేట పీఠాధిపతి మాదవానంద సరస్వతీ స్వామి ఆధ్వర్యంలో గ్రామ అర్చకులు రాజేశ్వరశర్మ, వేదపండితులు యంత్ర, విగ్రహ, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ చేశారు. వేదమంత్రాలతో హోమం, ప్రాణప్రతిష్ఠ, మహాపూర్ణాహుతి నిర్వహించారు. మూడురోజుల పాటు గ్రామస్తులు, యువకులు భక్తులు భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు నిర్వహించారు. తొలుత దేవతా మూర్తులను ఎమ్మెల్యే సునీతా రెడ్డి దర్శించుకొని పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు.

బంజారా నాయకుల ముందస్తు అరెస్టు



బంజారా నాయకులను అరెస్ట్ చేసిన పాపన్నపేట పోలీసులు

పాపన్నపేట(మెదక్): బంజారా హక్కుల పోరాటం కోసం వికారాబాద్ తరలి వెళ్తున్న బంజార నాయకులను సోమవారం పాపన్నపేట పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. బంజారాలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న డిమాండ్‌తో వికారాబాద్ వెళ్తున్న మండల నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకొని, పూచీకత్తుపై విడుదల చేశారు. వీరిలో మండల బంజార శాఖ అధ్యక్షుడు బానోత్ మోహన్, ఐక్యవేదిక నాయకుడు సంతోష్, నాయకులు రవి, మోహన్, శంకర్, రమేశ్, పూల్‌సింగ్ ఉన్నారు.

పరామర్శ

నిజాంపేట(మెదక్): మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు శంకరయ్య ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందడం బాధాకరమని మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి అన్నారు. ఈ మేరకు ఆమె సోమవారం మండలం రాంపూర్ గ్రామానికి చేరుకొని శంకరయ్య భౌతిక కాయానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సంపత్, మాజీ సర్పంచ్ విజయ్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు, యాదగిరి మాజీ మండల కో ఆప్షన్ సభ్యుడు గౌస్, నాయకులు రాజ గౌడ్, అంజాగౌడ్, ఎల్లం దుర్గయ్య, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు ఎప్పుడో ?

- కేంద్రం వద్ద రైతుల పడిగాపులు

అల్లాదుర్గం(మెదక్): ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారులు మొక్కుబడిగా ఏర్పాటు చేసి, చేతులు దులుపుకుంటున్నారని రైతులు వాపోయారు. ధాన్యం కొనుగోలు కేంద్రానికి తెచ్చినా.. కొనడం లేదని మండల పరిధిలోని సీతానగర్ రైతులు సోమవారం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రానికి ధాన్యం తెచ్చి చాలా రోజులవుతున్నా.. అధికారులు మాత్రం గన్నీ బస్తాలు లేవని, హమాలీలు లేరని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం ఎప్పుడు కొంటారోనని రైతులు కేంద్రాల వద్ద ఎదురు చూస్తున్నారు.



అల్లాదుర్గం(మెదక్): సీతానగర్‌లో ఆందోళన చేస్తున్న రైతులు

ఇబ్బందులు లేకుండా చూడాలి

నర్సాపూర్: కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చే రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆర్‌డీఓ మహిపాల్ సూచించారు. ఆయన సోమవారం నర్సాపూర్‌లోని ఓ రైస్‌మిల్లుతో పాటు పలు కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సరిపడా హమాలీలను నియమించుకొని మిల్లుకు వచ్చే వడ్ల లారీలను వెంటనే అన్‌లోడ్ చేయాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్‌ఐ ఫైజల్ ఉన్నారు.

త్వరగా అన్‌లోడింగ్ చేయాలి

శివ్వంపేట(నర్సాపూర్): రైస్‌మిల్లర్స్ యాజమాన్యం ధాన్యం లారీలను త్వరగా అన్‌లోడింగ్ చేయాలని నర్సాపూర్ ఆర్‌డీఓ మహిపాల్ అన్నారు. సోమవారం శివ్వంపేటలోని ఓం వెంకటరమణ బైలర్ రైస్‌మిల్‌లో ధాన్యం అన్‌లోడింగ్‌ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రాల నుంచి ధాన్యం తరలింపు లారీల ద్వారా వేగవంతగా చేస్తున్నట్లు కూలీల సంఖ్య పెంచుకొని అన్‌లోడింగ్ ప్రక్రియ వేగవంతంగా చేసేందుకు రైస్‌మిల్స్ యాజమాన్యం సహకరించాలని కోరారు. కేంద్రాల్లో ధాన్యం లోడింగ్ లారీల్లో పూర్తి స్థాయిలో చేసి పంపించాలని సిబ్బందికి ఆదేశించారు. ఎలాంటి సమస్యలు తలెత్తిన తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఉప తహసీల్దార్ షఫీయోద్దీన్, ఆర్‌ఐ కిషన్, రైస్‌మిల్స్ యాజమానులు భిక్షపతిగౌడ్, శ్రీనివాస్‌గుప్తా, రంగయ్య గుప్తా, బెజుగం శ్రీనివాస్‌గుప్తా ఉన్నారు.



శివ్వంపేట(నర్సాపూర్): రైస్‌మిల్లులో అన్‌లోడింగ్ పరిశీలిస్తున్న ఆర్‌డీఓ

నార్సింగి మండల కేంద్రంలో..

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలోని రైస్‌మిల్లులను తహసీల్దార్ షేక్ కరీం తనిఖీ చేశారు. సోమవారం నార్సింగిలోని రైస్‌మిలులోని క్యూలో ఉన్న లారీలు, దించుకున్న లారీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నార్సింగిలోని రైస్‌మిలుల్లో లారీలు ఎక్కువ సమయం క్యూలో ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రం నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ధాన్యం కొనుగోలు ప్రారంభించాం

మనోహరాబాద్(తూప్రాన్): కేంద్రాల్లో సన్నరకం ధాన్యాన్ని సైతం కొనుగోలు ప్రారంభించామని తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పోతారం గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సన్నవడ్లు 6ఎంఎం కంటే తక్కువ ఉండాలని, గింజ వెడల్పు 2 ఎంఎం కంటే తక్కువ ఉండాలన్నారు. పొడవు 2.5 ఎంఎం కంటే ఎక్కువ ఉండాలని సూచించారు. వీరి వెంట ఏఈఓ నరేందర్ తదితరులు ఉన్నారు.



నర్సాపూర్‌లో రైస్‌మిల్లును తనిఖీ చేస్తున్న తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి

కొనుగోలు కేంద్రం, రైస్‌మిల్లు తనిఖీ

నర్సాపూర్ రూరల్: మండలంలోని తుల్జారాంపేట కొనుగోలు కేంద్రంతో పాటు శివ సాయి రైస్‌మిల్లు తూప్రాన్ డీఎస్పీ వెంకట్ రెడ్డి సోమవారం తనిఖీ చేశారు. ముందుగా తుల్జారాంపేట కొనుగోలు కేంద్రం వద్ద తూకం వేస్తున్న ధాన్యాన్ని పరిశీలించి రైతులకు, కొనుగోలుదారులకు సూచించారు. ఆరబెట్టిన ధాన్యాన్ని తూకం వేయించుకొని రసీదు పొందాలని రైతులకు సూచించారు. నర్సాపూర్‌లోని శివసాయి రైస్‌మిల్‌ను తనిఖీ చేసి, యజమానితో మాట్లాడి రైస్‌మిల్‌కు వచ్చిన ధాన్యాన్ని తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి, ఎస్‌ఐ లింగం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కుంటను కాపాడండి

నర్సాపూర్: ఆక్రమణదారుల నుంచి కుంటను కాపాడాలని సోమవారం అధికారులు నిర్వహించిన ప్రజావాణిలో మండలంలోని లింగాపూర్ గ్రామ రైతులు ఆర్‌డీఓ, తహసీల్దార్‌లకు వినతిపత్రాలు అందజేశారు. గ్రామానికి చెందిన మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు విఠల్, సంఘం సభ్యులు, రైతులు, నాయకులు లక్ష్మీనర్సయ్య, నందం, ఆంజనేయులు, శంకర్, నర్సింలు, కృష్ణ, యాదయ్య తదితరులు ఆర్‌డీఓ మహిపాల్‌తో మాట్లాడారు... తమ గ్రామంలోని 256సర్వే నంబరులో 12ఎకరాల 29 గుంటల ప్రభుత్వ భూమి విస్తీర్ణంతో బిచ్చరేని కుంట ఉందని, కుంట కింద సుమారు 45 ఎకరాల వ్యవసాయ సాగు భూములున్నాయని వివరించారు. కుంటపై గ్రామానికి చెందిన మత్స్యకారులతో పాటు చాలా మంది రైతులు ఆధారపడి ఉన్నారని అన్నారు. కొందరు అక్రమార్కులు కుంటను కబ్జాచేసి అమ్మకానికి పెట్టారని, ఆక్రమణదారుల నుంచి కుంటను కాపాడాలని ఆర్‌డీఓను కోరారు. అనంతరం వారు మండల తహసీల్దార్ శ్రీనివాస్‌కు సైతం వినతిపత్రం అందజేశారు.



నర్సాపూర్ ఆర్‌డీఓకు వినతిపత్రం అందజేసి, మాట్లాడుతున్న మత్స్యకారులు, రైతులు

నాణ్యమైన భోజనం అందించాలి

చిలప్‌చెడ్(నర్సాపూర్): కేజీబీవీ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మండల విద్యాధికారి విఠల్ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని చిట్కుల్ ఉన్నత పాఠశాలను, కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, వంటశాలను, పరిసరాలను పరిశీలించి, ఉపాధ్యాయులకు పలు సూచనలను ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిట్కుల్ కేజీబీవీలో పరిశుభ్రతను పాటించాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ, వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. డిసెంబర్‌లో జరిగే న్యాస్(నేషనల్ ఆచీవ్‌మెంట్ సర్వే) పై విద్యార్థులకు తరగతులు నిర్వహించి, ఉత్తమ ప్రతిభ కనబరిచేలా కృషి చేయాలన్నారు. 6 నుంచి 9 తరగతులు విద్యార్థులను ఏ,బీ,సీ గ్రూపులుగా విభజించి, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



చిట్కుల్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంఈఓ విఠల్

మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి కృషి



ఫైజాబాద్ చెరువులో చేపపిల్లల్ని వదులుతున్న మత్స్యకార సంఘం సభ్యులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తుందని మత్స్యశాఖ సహకార సంఘం ఫీల్డ్ అసిస్టెంట్ భరత్ అన్నారు. సోమవారం మత్స్యశాఖ సహకార సంఘం ఆధ్వర్యంలో మండలంలోని ఫైజాబాద్‌లోని పెద్ద చెరువు, కుంటల్లో కలిపి సుమారు 80 వేల చేపపిల్లల్ని వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ అవకాశాన్ని మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. గ్రామ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు మేకల జనార్దన్, మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు పుట్టి కిష్టయ్య, కార్యదర్శి చిన్న లక్ష్మణ్, సభ్యులు ఎంసీ.విఠల్, ఎంకే. విఠల్, వీరయ్య, సుభాష్, రవీందర్ పాల్గొన్నారు.

తప్పులు లేకుండా నమోదు చేయండి



శివ్వంపేట(నర్సాపూర్): సర్వేను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ ఎల్లయ్య



కొల్చారం(నర్సాపూర్): సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ ఎంపీడీఓ కృష్ణవేణి

కొల్చారం(నర్సాపూర్): గ్రామంలోకి సర్వే కోసం వెళ్లే ఎన్యుమరేటర్లు ప్రజలు ఇచ్చే సమాచారాన్ని తప్పులు లేకుండా నమోదు చేయాలని తహసీల్దార్ గఫర్ మియా సర్వే సిబ్బందికి సూచించారు. సోమవారం మండలంలోని సంగాయిపేట గ్రామంలో కొనసాగుతున్న ఇంటింటి సర్వేను పరిశీలించారు. ఈ సర్వే సమయంలో పత్రాల్లోని అన్ని ప్రశ్నలకు సమాచారాన్ని ఇవ్వాలంటూ ఒత్తిడి చేయొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణవేణి, ఆర్‌ఐ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నిర్దేశించిన విధంగా పూర్తి చేయాలి

శివ్వంపేట(నర్సాపూర్): ఇంటింటి సమగ్ర సర్వేను ప్రభుత్వం నిర్దేంచిన విధంగా పూర్తి చేయాలని జెడ్పీ సీఈఓ ఎల్లయ్య అన్నారు. సోమవారం ఆయన శివ్వంపేటలో సర్వేను పరిశీలించి ఎన్యుమరేటర్లకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుటుంబ సభ్యుల వివరాలు తప్పులు లేకుండా నమోదు చేసి, నిర్దేశించిన ప్రకారం సర్వే చేసి వాటి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఎంపీఓ తిరుపతిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కృష్ణగౌడ్, గణేశ్‌గౌడ్ ఉన్నారు.



చిలప్‌చెడ్(నర్సాపూర్): సర్వే వివరాలు సేకరిస్తున్న ఎన్యుమరేటర్

పారదర్శకంగా వివరాలు సేకరించాలి

చిలప్‌చెడ్(నర్సాపూర్): సమగ్ర కుటుంబ సర్వేలో సభ్యుల నుంచి పారదర్శకంగా వివరాలు సేకరించాలని ఎంపీడీఓ ఆనంద్ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని పలు గ్రామాల్లో ఎన్యుమరేటర్లు సర్వే చేస్తున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుటుంబ సభ్యులు ఎన్యుమరేటర్లకు సరైన వివరాలు తెలియజేయాలన్నారు. ఎన్యూమరేటర్లు ఎలాంటి తప్పులు లేకుండా సర్వే చేయాలని సూచించారు.

అటవీ భూమి చదును

శివ్వంపేట(నర్సాపూర్): అటవీ భూమిని కబ్జా చేసేందుకు రాత్రి వేళల్లో పలువురు చెట్లను నరికి వేసి, భూమిని చదును చేశారు. పిల్లుట్ల అటవీ కంపార్ట్ పరిధిలోని పూర్వ శివ్వంపేట పంచాయతీలో అటవీ భూమిని కబ్జా చేసేందుకు ప్లాంటేషన్‌లో ఏర్పాటు చేసిన చెట్లను సైతం తొలగించారు. అటవీ భూములు గుర్తిస్తూ హద్దుల ఏర్పాటుతో పాటు కందకం చేపట్టినప్పటికీ వాటిని దాటి లోనికి ప్రవేశించి అటవీ భూమిలోని చెట్లను నరికి వేస్తున్నప్పటికీ సంబంధిత అటవీ అధికారులు మాత్రం చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నట్లు పలువురు ఆరోపించారు. ఈ విషయం గురించి అటవీ సెక్షన్ అధికారి సత్యనారాయణ వివరణ కోసం ఫోన్‌లో ప్రయత్నించగా స్పందించలేదు.

అందుబాటులో వరి విత్తనాలు

నర్సాపూర్ రూరల్: పట్టణంలోని నర్సాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో 118 రకం వరి విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి తెలిపారు. విత్తనాలు అవసరమున్న రైతులు పట్టా పాస్‌బుక్, ఆధార్ కార్డు తీసుకురావాలన్నారు.

హార్వెస్టర్‌పై కేసు నమోదు

తూప్రాన్: నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపై నడుపుతున్న వరి కోతలకు ఉపయోగించే హార్వెస్టర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివానందం సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో వరి కోతలు ఊపందుకున్న నేపథ్యంలో హార్వెస్టర్ యంత్రాలు విచ్చలవిడిగా కటింగ్ బ్లేడును యంత్రానికి ముందుభాగంలో బిగించుకొని నడుపుతున్నారన్నారు. ఫలితంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని చెప్పారు. మోటార్ వెహికల్ చట్టం ప్రకారం.. యంత్రంపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇకపై యంత్రం యాజమానులు కటింగ్ బ్లేడును పొలంలోకి వెళ్లిన తర్వాతనే బిగించుకోవాలని సూచించారు.

విద్యార్థులను పాఠశాలకు పంపించండి

- ఎంఈఓ బుచ్చనాయక్

శివ్వంపేట(నర్సాపూర్): విద్యార్థులను ప్రతీరోజు పాఠశాలకు పంపించాలని ఎంఈఓ బుచ్చనాయక్ తల్లిదండ్రులకు సూచించారు. మండల పరిధిలోని చిన్నగొట్టిముక్ల ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థులు సక్రమంగా పాఠశాలకు రాకపోవడంతో సోమవారం వారి ఇళ్ల వద్దకు వెళ్లి విద్యార్థులు వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. విద్యార్థి దశ పదో తరగతి కీలకమని పాఠశాలకు హాజరు కాకపోవడంతో నష్టపోవాల్సి వస్తుందని సూచించారు. క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించి, వారి ఉన్నతస్థాయి కోసం కృషి చేయాలని కోరారు. అనంతరం పలువురు విద్యార్థులను ఇళ్ల నుంచి పాఠశాలకు తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం ఇందుమతి, తదితరులు ఉన్నారు.



ఇళ్ల వద్ద విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ

ఉద్యోగ భద్రత కల్పించండి

నర్సాపూర్: ఆశ కార్యకర్తలకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ జిల్లా ఆశ వర్కర్ల సంఘం ప్రతినిధులు సమత, లత, సంధ్యారాణి ఎమ్మెల్యే సునీతారెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, నెలకు రూ.18వేల జీతం ఇచ్చేలా కృషి చేయాలని కోరారు. ఏఎన్‌ఎం తదితర పోస్టులకు తమకు ప్రాధాన్యత ఇవ్వాలని, హెల్త్ కార్డులు, ఎక్స్‌గ్రేషియా అందేలా చూడాలని తెలిపారు. ఎమ్మెల్యే స్పందిస్తూ.. ఆశ వర్కర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి పరిష్కరించేందుకు కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు ఫర్జానాబేగం, వెంకటలక్ష్మి తదితరులు ఉన్నారు.



నర్సాపూర్ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న జిల్లా ఆశ వర్కర్ల సంఘం ప్రతినిధులు, ఆశవర్కర్లు

లోకమంతన్ పోస్టర్ ఆవిష్కరణ



ఆదర్శ పాఠశాలలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న తపస్ ఉపాధ్యాయ సంఘం నాయకులు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంట ఆదర్శ పాఠశాలలో సోమవారం తపస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో లోకమంతన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తపస్ ఉపాధ్యాయ సంఘం మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ మాట్లాడుతూ.. లోకమంతన్ ప్రోగ్రాం శిల్పారామంలో నవంబర్ 21 నుంచి 24 వరకు ప్రతీరోజు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఉంటుందని తెలిపారు. ఇందులో భారతదేశం సంప్రదాయాలు, సంస్కృతి, పద్ధతులు, వారసత్వ పునరుజ్జీవనాన్ని వివిధ రాష్ట్రాల కళాకారులు ప్రదర్శించనున్నారు. ఈ కార్యక్రమాలను తిలకించేందుకు విద్యార్థులు, యువకులు అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో తపస్ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, దేవానంద్, తపస్ స్పోర్ట్స్ కమిటీ కన్వీనర్ వినోద్, తపస్ మండలాధ్యక్షులు వెంకటేష్, శారద, శంకర్, మంజులత, లతీఫా, రమేశ్, అరుణతో పాటు తదితరులు పాల్గొన్నారు.

తెరుచుకోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్



రత్నపూర్‌లో మూతపడిన ఆయుష్ ఆస్పత్రి

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని రత్నపూర్ గ్రామంలోని గ్రామ పంచాయతీ భవనంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (ఆయుష్) తెరుచుకోవడం లేదు. ఇక్కడ వైద్యుడు నియామకమైనప్పటికీ సక్రమంగా విధులకు హాజరు కావడంలేదు. దీంతో ఆస్పత్రి సేవలు రోగులకు అందడంలేదు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సిబ్బంది ఇష్టరాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. వైద్య సేవలు అందకపోవడం వల్ల అందులోని విలువైన మందుల కాలం చెల్లిపోవడంతో 15 రోజుల క్రితం తగులబెట్టారని రోగులు వాపోయారు. ఈ విషయం గురించి ఆయుష్ డీపీఓ రవి వివరణ కోసం ఫోన్‌లో సంప్రదించగా.. రత్నపూర్ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌కు శ్రీనివాస్ వైద్యుడిగా ఉన్నాడని, సక్రమంగా విధులకు హాజరుకాని విషయంపై విచారించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

నర్సాపూర్: సీఎం రిలీఫ్ ఫండ్ పథకంతో పేదలకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. సోమవారం ఆమె నియోజకవర్గంలోని పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందచేశారు. నర్సాపూర్‌కు చెందిన కమలమ్మ, మండలంలోని రెడ్డిపల్లికి చెందిన చంద్రకళ, కొడిపల్లి మండలానికి చెందిన నరేశ్, ప్రవీణ్ తదితరులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. ఆమె వెంట పలువురు బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని చల్మెడ, నందగోకుల్ గ్రామానికి చెందిన పలువురికి సోమవారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకుల పంపిణీ చేశారు. చల్మెడ గ్రామానికి చెందిన కడబోయిన శామవ్వకు రూ.60 వేలు, రాగుల పరశురాములుకు రూ.40 వేలు, రావుల బాబయ్యకు రూ.6 వేలు, నందగోకుల్ గ్రామంలో వడ్ల లక్ష్మయ్యకు రూ. 34 వేలు, పిట్ల లావణ్యకు రూ. 17 వేల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో చల్మెడ గ్రామ తాజా మాజీ సర్పంచ్ నర్సింహరెడ్డి, ఉపసర్పంచ్ రమేశ్, వార్డ్‌మెంబర్లు రాములు, శ్రీను, తిరుమలస్వామి పాల్గొన్నారు.

కొల్చారం(నర్సాపూర్): హైదరాబాదులోని తన క్యాంప్ కార్యాలయంలో సోమవారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి మండలానికి చెందిన పలువురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. రంగంపేట గ్రామానికి చెందిన ఊరడి లక్ష్మణ్‌కు రూ.15,800లు, గోకని నరసమ్మ రూ.12,500లు, తలారి నర్సమ్మ రూ.15,500ల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ రమేశ్‌కుమార్, మండల బీఆర్‌ఎస్ పార్టీ యువత అధ్యక్షుడు సంతోష్ రావు, నాయకులు చిట్కుల సురేశ్, సోమ నర్సింలు ఉన్నారు.



చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి